ఆర్ముద్రగారు వచ్చారు. అతిథులంతా కూడా వచ్చారు. రాగిణి తన భర్త వూళ్ళో లేడనీ, అనీల్‌ని తనకు రైడివ్వమని ఫోన్ చేసింది. అనీల్ వెళ్ళి ఆమెను తీసుకువచ్చాడు. అందరూ ఎంత సంతోషంగా వున్నా ఎన్నడూ లేనిది అనీల్ చిటపట్లాడసాగాడు. ఆర్ముద్రగారు త్వరగా వెళ్ళిపోయారు. "ఇప్పుడు చీకటి పడిందిగా! మగవాళ్ళ రైడిస్తే... భయం నాకు రేప్ చేస్తారని... తోడుగా నువ్వూ రా నీలిమా!"

అమాయకంగా ముఖం పెట్టింది రాగిణి. "అలాంటి భయమేం లేదులెండి. మీరేమీ అనామకుల్తో వెళ్లడం లేదు లెండి" చెప్పింది నీలిమ.

"నా జాగ్రత్త నాది. రేప్ అంటే భయంలేని వాళ్ళ అర్థరాత్రి అపరాత్రి తిరుగుతారు.

"అసలా ఆలోచనేమిటి?" అడిగింది నీలిమ.

"నువ్వు కూడా చెప్పావ్‌గా! ఈ మధ్య స్టేట్స్‌లో ఎవరో ఇండియన్ లేడీని రేప్ చేశారని" సాగదీసింది.

అనవసరంగా వాదించడం... అందులో... ఈమెతో. ఎందుకులే.. అని.. మౌనం వహించింది నీలిమ. రాగిణి డ్రైవ్ చేయగలిగిన నీరజ కార్లో వెళ్ళిపోయింది.

ఆ రోజు రాత్రి పన్నెండు గంటలకు రాజుకుంది నిప్పు. రోజులూ - వారాలు - నెలలూ... సంవత్సరాలూ గడిచినా అది ఆరని చిచ్చయింది కానీ... చిచ్చుబుడ్డిలా కాలేదు.

నీలిమ జీవితం అనుక్షణం భర్త అనుమానంతో, వేధింపుల్తో సాధింపుతో, ఎత్తి పొడుపులతో దిన దిన గండంగా వుంది. బయటికి అడుగు పెట్టకుండా కట్టుదిట్టం చేశాడు. అవసరం అయితే లాస్ ఆఫ్ పేతో సెలవలు కూడా తీసుకుంటున్నాడు లేనిపోని అక్రమ సంబంధాలన్నీ అంటగట్టి..

నిజం ఒప్పుకో, నిజం ఒప్పుకో అని బాధిస్తు న్నాడు. ఆమెకి ఎప్పుడెప్పుడు ఎవరెవరు రైడిచ్చారో చెప్పమని... ఆమె వాళ్లతో ఎలా మసలుకునేదో వివరించమని... తాను ఇంట్లో లేనప్పుడు ఏ మగవాళ్లయినా వచ్చేవాళ్లా! లేదా! అని నిలదీసి బెదిరిస్తున్నాడు.

విషయం అర్థం కాక... రాగిణికి ఫోను చేసి... "ఆ రోజు కార్లో ఏం జరిగింది?" అని అడిగింది నీలిమ.

"నన్ను రేప్ చెయ్యొద్దన్నాను నా సేఫ్టీ కోసం."

అదీ జవాబు. అంతకు మించి... ఒక్క ముక్క గూడా రాగిణి నుంచి రాబట్టలేక పోయింది. ఇంకేమైనా అడిగితే... "నేనలాగే మాట్లాడుతాను. కావాలంటే..." కన్నడ సంఘం కార్యదర్శినీ, అరవసంఘం అధ్యక్షుణ్ణి కూడా అడగండి. వాళ్ల రైడిచ్చిన రోజు కూడా ఇలాగే చెప్పాను రేప్ చెయ్యొద్దని.

నిట్టూర్చింది నీలిమ.

భర్తని ఎంత వేడుకున్నా అతను ఏం జరిగిందో చెప్పడం లేదు. ఆమె ప్రయత్నమంతా బూడిదలో పోసిన పన్నీరు చందమైంది.

** ** **

ఆ రోజు కారులో...

"అనీల్ మీరు నాకు రైడిస్తున్నారు కదా! నన్ను రేప్ చేస్తారా? ఒక వేళ ఇలాగే నీలిమను ఎవరైనా రేప్ చేస్తే... అయినా ఇష్టమైన వాళ్లతో అయితే అది రేప్ కాదులెండి. మగవాళ్లంతా నీలిమనే చూస్తుంటారు. రెండు మూడు సార్లు ఫోన్ చేశాను మీ ఇంటికి మీరు లేరు గానీ... ఎవరో కొత్త మగవాడి గొంతుక. నీలిమ బాయ్ ఫ్రెండేమో కదూ! ఒక్కొక్కసారి ఇంట్లోనే వుండదు. ఉద్యోగం లేదంటుంది కానీ... ఊరంతా తనదిలాగేవుంది. రేప్ గురించి భయం లేదనుకుంటూ... అందుకే మీరు ఊళ్లో లేనప్పుడు రెండు మూడు సార్లు మరాఠీ మనోహర్‌తో పాటు ఇండియా హౌస్‌లో కనిపించింది.

రాగిణి తన ధోరణి మానలేదు.

అనీల్ డ్రైవ్ చేస్తున్నా.. మాటి మాటికీ చేతులు బిగుసుకుంటున్నాయి. భార్య పట్ల అనుమానం అగ్నిలా ప్రజర్విల్లింది.. కానీ... అతిథులు వెళ్లే వరకూ చిటపటలతో సరిపెట్టుకున్నాడు. అతనప్పుడే నిర్ణయించుకున్నాడు.

విడాకులు అవశ్యమని.

** ** **

రెండు గంటల తర్వాత ఒక నిర్ణయానికొచ్చింది నీలిమ. వాష్ రూంలో కెళ్లి ముఖం కడుక్కుని వచ్చి.. ఫ్రిజ్‌లో నుండి ఉప్మా తీసుకుని.. వేడి చేసుకుని.. తిని.. ఆరంజ్ జ్యూస్ త్రాగి... ప్రతి బుధవారం వచ్చే.. స్కార్‌బరో మిర్రర్ తిరగేస్తోంది ఉద్యోగాల కోసం. మధ్య మధ్యలో ఫోన్లు కూడా చేస్తోంది అనుకూలమైన ఉద్యోగం తనకున్న అర్హతలు చాలనుకుంటే.

అనీల్ మనసులో అనుమాన బీజాలు నాటి, వాటికి నీరు పోసి... మంచి ఎరువు వేసిన రాగిణి... తన భర్తవల్ల తీరని వాంఛలన్నీ పర పురుషుల ద్వారా తీర్చుకోవాలనే ఉబలాటంలో ఎంతోమందికి ఎన్నో చిక్కులు తెస్తూ... తాను మాత్రం సుఖంగా వుంది.

ఆ మాయలాడి మాటలకు ప్రభావితుడై, విచక్షణా జ్ఞానం కోల్పోయిన అనీల్ సంతోషంగానే వున్నాడు భార్య నుంచి విడాకులు లభించినందుకు. అతనంతకు ముందే... చెప్పాడు ఒక శ్రీలంక అమ్మాయికి, తనకు విడాకులు లభించగానే తప్పకుండా ఆమెను వివాహం చేసుకుంటానని.

అసలీ విషయాలేవీ తెలియని నీలిమ మాత్రం... పిరికితనం పనికిరాదని... సమాధానపడి... బ్రతుకు తెరువు కోసం... పరుగు తీయవల్సిన పరిస్థితి ఏర్పడింది.

'అదే విధి'

# వేట

రెండు గంటలు పట్టినా మెరుపులాంటి ప్లాను తట్టినందుకు మిత్ర త్రయం ఆనందపడింది. వేట ఫలించి తీరుతుందని గట్టి నమ్మకం కుదిరింది. 'రెడీ' అనుకున్నారు.

ఉమెన్స్ కాలేజీ టౌన్‌కి కొంచెం దూరంలో వుంది. రోడ్డు కటూ యిటూ రెండు బస్ స్టాపులున్నాయి. ముగ్గురిలో అందంగా వుండే ఆదిత్య జట్టుకి నాయకుడు. అతని వెంట వుండేది రఘు. సాధువుగా కనిపించే సత్యం తర్వాత సినిమా ఫక్కీలో రంగ ప్రవేశం చేయాలి. వేటలో దొరికే బేబీని మాటల్లో పెట్టి మచ్చిక చేసుకునేందుకు టౌను మొదట్లో వుండే రఘు రూమ్‌కి తీసుకురావాలి.

ఆదిత్య, రఘు బస్ స్టాప్ దగ్గర కాపు కాశారు. అక్కడున్న ముగ్గురమ్మాయిల్లో అందంగా వున్నది ఒక్కరే. ఆడపిల్లల్లో అందం తగ్గిపోతున్నందుకు జాలిపడ్డారు. ఒక బస్సు రాగానే ఇద్దరమ్మాయిలు ఎక్కి టాటా చెప్పి వెళ్ళిపోయారు. మిత్రులు సంబరపడ్డారు.

ఆలస్యం చేయకుండా కథా క్రమం ఆరంభించారు జోరుగా. చూపుల్తో గుచ్చుతున్నారు. మాటల్తో నమిలేస్తున్నారు. అమ్మాయి నిస్సహాయంగా బస్సు వచ్చే వైపు చూస్తోంది. ఎవరన్నా వస్తే లిఫ్ట్ అడిగి తప్పించుకుందామనుకునే వరకు లాక్కొచ్చారు కథని నిమిషాల్లో. అనుకున్న ప్రకారం అంత దూరంలో సత్యం స్కూటరు చూడగానే ఏమీ ఎరగనట్లు అవతలికెళ్ళిపోయారు. అయినా గమనిస్తూనే వున్నారు.

సత్యం, ఆ అమ్మాయి ఏదో మాట్లాడుకుంటున్నట్లుంది. స్కూటరు వెనక కూర్చుంది. ప్లాన్ అద్భుతంగా నడుస్తున్నందుకు వుబ్బి తబ్బిబ్బయ్యారు. కలలు కంటూ పరుగులాంటి నడకతో రఘు రూమ్ వైపు బయల్దేరారు, బస్సు కోసం నిరీక్షించేంతటి సహనం లేకపోవడం చేత.

రూం చేరారు. సత్యం, అమ్మాయి జాడ లేదు. బిత్తర పోయారు. హ్యాండిచ్చి వుంటాడా అన్న సందేహం మొదలయింది.

ఆ అమ్మాయి సత్యం చెల్లెలని, నిజంగా తమ లాంటి కిరాతకుల చేతుల్లో పడితే తన చెల్లెలేమై వుండేదోనని సత్యం తల్లడిల్లి పోతున్న సంగతి వాళ్ళకి తెలియదు. అంతేకాదు, సత్యం మారాడని, యింకెప్పుడూ వేటకి రాడని, వేటాడే వాళ్ళని నిలువునా పాతేస్తాడని కూడా వాళ్ళకి తెలియక వదలని ఆశతో నిరీక్షిస్తున్నారు.

గోవిందరాజు రామకృష్ణారావు